అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

బుధవారం 29 జూలై 2026 పేజీలు : 04

ఎల్‌నినో ప్రభావంపై రైతులు,అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్‌నినో పై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

సమావేశంలో పాల్గొన్న అధికారులు కూటమి నాయకులు

- కరువు సవాళ్లను సమిష్టి కృషితో ఎదుర్కొందాం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి సవిత

పెనుకొండ, జూలై 28: ప్రభాతవార్త

ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలోని భువన విజయం సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావంపై మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రపంచంలోని సుమారు 140 దేశాలపై ఎల్‌నినో ప్రభావం ఉండనున్నట్లు,రాబోయే నాలుగు నెలల పాటు దీని ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారని మంత్రి సవిత తెలిపారు. దాదాపు 70 సంవత్సరాల తర్వాత తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రైతులు కొత్తగా బోర్లు వేయకుండా, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆచితూచి పంటలు సాగు చేయాలని సూచించారు. తక్కువ వర్షపాతానికి అనుకూలమైన పంటలు, ముఖ్యంగా చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి నీటి బొట్టును ఆదా చేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వి బి జి రాంజీ పథకంను రైతులు ఉపయోగించుకోవాలని అలాగే ఈ పథకంలో పని దినాలను పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలో గ్రామాల్లో వ్యవసాయ తోటలకు గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు.విద్యుత్ శాఖ అధికారులు రైతులకు ఎదురయ్యే విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ మంచినీటి సరఫరా కోసం రూ.11.50 కోట్లతో ఆమోదం పొందిన ఆర్ బ్ల్యూఎస్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ప్రభుత్వం, అధికారులు, రైతులు, ప్రజలు అందరి సమిష్టి కృషితో సమర్థంగా ఎదుర్కొని కరువు పరిస్థితులను అధిగమించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్ ,రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు రమణారెడ్డి, రామకృష్ణ, చందన,ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు మాధవ నాయుడు, నారాయణస్వామి, చిన్నప్పయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మండల కన్వీనర్లు ఈశ్వర్ ప్రసాద్, గోవిందరెడ్డి, వెంకటేశులు, బాలకృష్ణ చౌదరి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, పాలడుగు చంద్ర, పరిగి మండల ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు మాజీ ఎంపీటీసీ వెంకటరమణస్వామి (సోమప్ప) ప్రవీణ్ రెడ్డి, చంద్రకాంతమ్మ, రమణమ్మ, బిజెపి నాయకులు రామకృష్ణ, జనసేన నాయకురాలు శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపుకోవాలి

- తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలి
- నింబగల్లు ఎస్.ఎస్ ట్యాంకుల పరిశీలనలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్
- పంపింగ్‌కై అదనపు మోటార్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశం
- విడపనకల్లులో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

నీటి పంపింగ్ కోసం చేపడుతున్న ఏర్పాట్ల గురించి కలెక్టర్ వివరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ఉరవకొండ, జూలై 28 ప్రభాతవార్త

హెచ్ఎల్‌సీకు నీటి విడుదల జరుగగానే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని నింబగల్లు గ్రామంవద్దగల ఉరవకొండతోపాటు మరో 7 గ్రామాలకు తాగు నీటిని అందించే సీపీడబ్ల్యూ స్కీమ్ సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిశీలించారు.

మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

హెచ్ఎల్‌సీ, జీబీసీ హెడ్‌లు, ప్రధాన కాలువలను పరిశీలించి నీటి ప్రవాహాలకు ఏవైనా అడ్డంకులా ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీపీడబ్ల్యూ స్కీమ్‌కు సంబంధించి హెచ్ఎల్‌సీ ప్రధాన కాలువకు పక్కనగల రా వాటర్ పంపింగ్ మెయిన్‌ను తనిఖీ చేసి ఎన్ని మోటార్లు నీటి పంపింగ్‌కు వినియోగిస్తారు, స్టాండ్ బై కింద ఎన్ని మోటార్లు ఉన్నాయి అన్న విషయాలపై ఆరా తీశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున ఈ ఏడాది తుంగభద్ర జలాశయం నుండి ఆగస్టులో తాగునీటి కోసం హెచ్ఎల్‌సీకు తక్కువ నీరు వచ్చే అవకాశం ఉందని ఆ నీటిని ఆర్‌డబ్ల్యూఎస్, సత్యసాయి నీటి పథకాల ద్వారా తాగునీటి అవసరాలకు సంపూర్ణంగా వినియోగించుకోకపోతే వచ్చే వేసవిలో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కాలువలో నీటి ప్రవాహం ప్రారంభం కాగానే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నీటి పంపింగ్ చేపట్టి వేగంగా పూర్తిస్థాయిలో నింపుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం మోటార్లు, ఇతరత్రా సదుపాయాలు అవసరమైతే వెంటనే ప్రదిపాదనలు పంపాలని వెంటనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నింపుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. హెచ్ఎల్‌సీ కింద ఈ సీజన్‌లో పంటలకు నీరు ఇచ్చే అవకాశంలేదని రైతులు వరి కాకుండా ఇతరత్రా పంటలు సాగు చేసుకోవాలన్నారు. తాగునీటి అవసరాలు తీరిన తరువాత ఏదైనా అవకాశం ఉంటే పంటలకు నీటిని అందించే ప్రయత్నం చేస్తామన్నారు. కాలువలో మోటార్లు వేసి ఎవరూ నీటిని తోడుకోకుండా ట్రాన్స్‌ఫోర్స్ నిరంతర నిఘా కొనసాగుతుందని కలెక్టర్ ఓ.ఆనంద్ వివరించారు. అనంతరం విడపనకల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, పంప్‌హౌస్‌ను కలెక్టర్ సందర్శించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జి.శ్రీనివాసులు, హెచ్ఎల్‌సీ ఎస్ఈ సుధాకర్ రావు, ఉరవకొండ తహశీల్దార్ పి.జి.అరుణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అంజుమన్ సఫ్రీన్, ఏఈఈ ఐజయ్య, సైట్ ఇంజనీర్ దాక్షాయణి దేవి, సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో మహమ్మద్ రఫీ, సత్యసాయి నీటి పథకం డీఈఈ రామారావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎడ్విన్, ఆర్‌డబ్ల్యూఎస్ హెల్పర్లు కుళ్లాయప ్ర, శ్రీరాములు, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను కోరిన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, జూలై 28 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సమస్యల పరిష్కారం, ప్రయాణికులకు మెరుగైన రైల్వే సౌకర్యాల కల్పన, రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రైల్వే సంబంధిత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ, రైళ్ల నిలుపుదలలు, కొత్త రైలు సర్వీసులు, సమయాల పునరుద్ధరణ, అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు, స్టేషన్ల అభివృద్ధి వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కల్లూరు, రాయలచెరువు ప్రాంతాల్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలుపుదల కల్పించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. అలాగే ఉదయం వేళ బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, గుంతకల్లు నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి బెంగళూరుకు చేరుకుని, తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు బెంగళూరు నుంచి గుంతకల్లుకు వచ్చే విధంగా కొత్త ప్యాసింజర్ రైలును ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రత్యామ్నాయ రోజుల్లో మాత్రమే నడుస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను... మిగతా 3లో...

కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకు అనంతపురం పార్లమెంట్‌లో నెలకొన్న సమస్యలను వివరిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

మెగా డీఎస్సీ-2025 నియామక ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై

స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలి

- శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో విద్యార్థి-యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన
- సంఘీభావంగా పాల్గొన్న వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

నిరసన వ్యక్తం చేస్తున్న వైకాపా నాయకులు

అనంతపురం, జూలై 28 ప్రభాతవార్త బ్యూరో

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వైఎస్సార్సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ..మెగా డీఎస్సీ-2025 నియామక ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని, అలాగే విద్యాశాఖ పరిపాలనపై ప్రభుత్వం పూర్తి వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ నియామకాల్లో పారదర్శకత, సమాన అవకాశాలు, నిబంధనల అమలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు పాఠ్య పుస్తకాలు, విద్యాకానుక, పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలను ఆలస్యం లేకుండా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం చేస్తే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్సీ నియామకాల విషయంలో తరచూ మారుతున్న నిబంధనలు, ప్రత్యేక ఉత్తర్వులపై అభ్యర్థుల్లో అనుమానాలు పెరిగాయని, అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి అన్ని సందేహాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. లక్షలాది మంది నిరుద్యోగ యువత జీవితాలకు సంబంధించిన.. మిగతా 2లో

అసత్యాల వైసీపీకి

రాజకీయ సమాధి తప్పదు

మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

రాయదుర్గం జూలై 28 ప్రభాతవార్త

అబద్ధాలు, అసత్యాల పునాదులపై ప్రారంభమైన వైసీపీ కి రాజకీయ సమాధి తప్పదని, వైసిపి తన ప్రస్థానంలో కీలకమైన అంశాల్లో ఏనాడూ నిజం చెప్పిన పాపాన పోలేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో అత్యంత పకడ్బందీగా డీఎస్సీ పోటీ పరీక్ష నిర్వహిస్తే పదేపదే సత్య దూరమైన ఆరోపణలు చేయడం ఆ పార్టీ నీచ సంస్కృతికి నిదర్శనమని దుయ్యబట్టారు. రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్సీపై వైసీపీ వైఖరిని ఆయన తీవ్రంగా ఎండగట్టారు. అక్రమాలు జరిగాయని నిరూపించదగ్గ స్పష్టమైన ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని నారా లోకేష్ చేసిన సవాలును జగన్ ఎందుకు స్వీకరించలేదని నిలదీశారు. బహుశా నిజం చెబితే జగన్ తల వేయి ముక్కలు అవుతుం దేమో..! అన్న శాపం ఏమైనా ఉందేమోనని ఎద్దేవా చేశారు. సర్కారు పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగై పేదలు చదువుకుని తమ ప్రతిభతో అత్యున్నత స్థాయికి ఎదగడం ఆయనకు ఇష్టం ఉండదన్నారు. అందుకే అడుగడుగునా జగన్ అతని పార్టీ నాయకులు డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం .. మిగతా 2లో

నారా లోకేష్ రాజీనామా చేయకుంటే

ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

ధర్నాలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

- యువత ఆకాంక్షలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం
- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత
- యువత విద్యార్థి సమస్యలపై భారీ అనంతలో భారీ ర్యాలీ
- హాజరైన పార్టీ ముఖ్య నేతలు
- యువజన విద్యార్థి నాయకులు

అనంతపురం సిటీ, జులై 28 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన డిఎస్సీలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని దీనికి నైతిక బాధ్యత వహించి మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. రాష్ట్రంలో దగా పడ్డ డిఎస్సీ అభ్యర్థులకు అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో భారీ ర్యాలీని నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న అనంత వెంకటరెడ్డి విగ్రహం వద్ద నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి సప్తగిరి సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడి మంత్రి నారాలోకేష్‌కి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్‌లతోపాటు పెద్ద ఎత్తున పార్టీ నేతలు, యువజన విద్యార్థి విభాగం నాయకులు పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. నీట్ పరీక్ష లీకేజీపై దేశ వ్యాప్తంగా ఆందోళనలను వ్యక్తం కావడంతో నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారన్నారు. అయితే రాష్ట్రంలో డిఎస్సీ నియామకంలో స్పోర్ట్స్ కోటాలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలుచోటు చేసుకున్నాయని, పరీక్షల విభాగంలోని ఉద్యోగుల డిఎస్సీలో ఎంపికైనట్లు ఆధారాలతో బయపడ్డాయన్నారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు నోరు మెదపడం లేదన్నారు. డిఎస్సీలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలో .. మిగతా 3లో

చెత్త నుండి సంపద తయారు కావాల్సిందే..!

- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి
- రాష్ట్ర పంచాయితీ రాజ్ అడిషనల్ కమిషనర్ సుధాకర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న పిఆర్ అడిషనల్ కమిషనర్ సుధాకర్ రావు

అనంతపురం సిటీ, జులై 28 ప్రభాతవార్త

ప్రతి పంచాయితీలో చెత్త నుండి సంపద తయారీని పూర్తి స్థాయిలో చేపట్టాలని రాష్ట్ర పంచాయితీ రాజ్ అడిషనల్ కమిషనర్ సుధాకర్‌రావు ఆదేశించారు. జెఎన్‌టియుఏ ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లా స్థాయి వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి పిఆర్ అడిషనల్ కమిషనర్ సుధాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయితీలలో గ్రీన్ అంబాసిడర్‌లు ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణతోపాటు వీధులను శుభ్రం చేసి తీసుకొచ్చే వ్యర్థాలను చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు .. మిగతా 3లో

గుండుమలకు గవర్నర్ కోటాలో ఈసారైనా ఎమ్మెల్సీ పదవి దక్కేనా!

చంద్రబాబునాయుడు అరెస్టు సందర్భంగా నిరసన చేస్తున్న మాజీఎమ్మెల్సీ (ఫైల్ ఫోటో)

కష్టపడి పనిచేసిన నాయకుడికి అభిష్టానం గుర్తించేనా!

అభినేత చంద్రబాబు, లోకేష్‌లపై ఆశతో ఎదురుచూస్తున్న కార్యకర్తలు

అనంతపురం, జులై 28, (ప్రభాతవార్త బ్యూరో)

ఇటీవల రాజ్యసభ సీట్లు కేటాయింపులో చివరి నిమిషంలో తప్పిపోయిన మడకశిర టిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామికి ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ సీటు దక్కేనా అని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో బలంగా చర్చ సాగుతోంది. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా అంకితభావంతో పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ , ఒక బీసీ నేతగా గుర్తింపు ఉన్న ముఖ్య నేత గుండుమల తిప్పేస్వామి కి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అయిన ఏలాంటి పదవి రాకపోవడం పట్ల మడకశిర ప్రాంత టీడీపీ కార్యకర్తలలో అసంతృప్తి ఎక్కువగా ఉంది. సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేష్ తగిన రీతిలో స్పందించి ఎమ్మెల్సీ సీటు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తారా లేదా అన్నది ప్రస్తుతం చర్చిని అంశంగా మారింది. సీనియర్ నాయకుడు,మడకశిర నియోజకవర్గం కు చెందిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి 2014లో చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు.తాను ఎక్కడున్నా కష్టపడి పనిచేసే తత్తంతో తనను నమ్ముకున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవడమే ఆయన సొంతం అని మడకశిర ప్రాంతంలో కార్యకర్తలు చెప్తుంటారు..ప్రస్తుతం రాష్ట్రంలో గవర్నర్ కోటాలో 2 ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ఎన్నుకునేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రస్తుతం సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గవర్నర్ కోట ఎమ్మెల్సీ రేసులో ముందంజలో ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. హిందూపురం పార్లమెంట్ పరిధిలోని మడకశిర నియోజకవర్గం గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలో ఉండేది. మాజీ ఎమ్మెల్సీ టిడిపిలో చేరడంతో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారింది .గుండుమల తిప్పేస్వామికి అన్ని పార్టీల్లోనూ అభిమానించే అభిమానులు గ్రామస్థాయి నుండి మంచి అనుబంధాలు ఉన్నాయని చెప్పవచ్చు. జడ్పిటిసిగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా, .. మిగతా 3లో

మెగా డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

- వైసిపి నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి సవాల్

అనంతపురం క్రైమ్ జూలై 28 ప్రభాతవార్త

మెగా డీఎస్సీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్న వైసీపీ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సవాల్ విసిరారు. అనంతపురంలో మంగళవారం రోజు మెగా డీఎస్సీ పై వైసీపీ నాయకులు చేపట్టిన నిరసనపై ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేవలం 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ పూర్తి చేశారని.. 16, 347 పోస్టులు భర్తీ చేశారని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన .. మిగతా 2లో

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్

సంతే కొండాపురంలో పాలం పిలుస్తుంది

పంటలు క్రాప్ ఇన్సూరెన్స్ పై రైతులకు అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టికల్చర్ అధికారులు

బ్రహ్మసముద్రం జూలై 28 ప్రభాతవార్త

సంతే కొండాపురం మరియు పాల వెంకటాపురం గ్రామం, బ్రహ్మసముద్రం మండలంలో, పి ఎం డి ఎస్, క్రాప్ ఇన్సూరెన్స్ మరియు ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా లక్ష్మీ కళ్యాణి అగ్రనమిస్ట్,భాస్కర్ రావు అగ్రి ఇంజనీర్ ఏ.ఆర్.ఎస్ రేకులకుంట, వారు మాట్లాడుతూ, పీఎండీఎస్ గురించి రైతులకు వివరిస్తూ ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ ముఖ్య ఉద్దేశం ఉద్యాన మరియు వ్యవసాయ పంటలలో భూసారాన్ని కాపాడడం, తక్కువ కాల పరిమితి గల పంటలు వేసుకోవడం,తేమను నిల్వ ఉంచడం,మిశ్రమ పంటల సాగు మరియు పంట ఆరోగ్యాన్ని కాపాడుతూ అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తి సాధించేందుకు రైతులకు సకాలంలో సాంకేతిక సూచనలు అందించడం."అనంతరం గోపాల్, బ్రహ్మసముద్రం అగ్రికల్చర్ ఆఫీసర్ మాట్లాడుతూ ఖరీఫ్ లోని క్రాప్ఇన్సూరెన్స్ సంబంధించి పత్తి, వేరుశనగ, దానిమ్మ, బత్తాయి, టమోటా, అరటి పంటలకు ఇన్సూరెన్స్ రైతు వాటా చెల్లించినట్లయితే వాతావరణం లో మార్పులు, పంట నష్టం, జరిగినప్పుడు రైతుకి బీమా వర్తిస్తుందని తెలిపారు. మరియు కళ్యాణదుర్గం ఉద్యాన అధికారి కృష్ణ తేజ మాట్లాడుతూ ఉద్యాన శాఖ అమలు చేసే పథకాల గురించి వివరిస్తూ పండ్ల తోటలు (ఎస్సీ /ఎస్టీ) వీడ్ మాట్స్,ప్యాక్ హౌస్ లు, ఫారం పాండ్లు, ప్లాస్టిక్ క్రేట్స్, సోలార్ కోల్డ్ రూమ్లు ,కోల్డ్ స్టోరేజీలు 4050 రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు కావున ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ కళ్యాణి అగ్రనమిస్ట్రీ ఏఆర్ఎస్ రేకులకుంట అనంతపురం వారు, ఉద్యాన అధికారి కృష్ణ తేజ గారు, బ్రహ్మసముద్రంఅగ్రికల్చర్ ఆఫీసర్ గోపాల్ వెటర్నరీ డాక్టర్ హరిణి, , ఆర్ఎస్కే సిబ్బంది గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

ఇందిరమ్మకాలనీలో సమస్యలను పరిష్కరించాలి

- అధికారుల నిర్లక్ష్యంపై వ్యవసాయ కార్మిక సంఘం మండిపాటు
- సమస్యలు తీర్చకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరిక

డిజిటల్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

లేపాక్షి, జూలై 28 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని మూడవ సచివాలయం పరిధిలో గల ఇందిరమ్మకాలనీలో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కాలనీలో సంఘం ఆధ్వర్యంలో "సామాజిక శంఖారావం" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా కాలనీలో కనీస సౌకర్యాలైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు, పబ్లిక్ కొళాయిలు లేక ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. అంత్యక్రియలు జరుపుకోవడానికి స్మశాన వాటిక కూడా లేకపోవడం దారుణమన్నారు. ఇంటి పన్నులు, వాటర్ బిల్లులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ, సౌకర్యాలు కల్పించడంపై అధికారులకు లేదా అని ప్రశ్నించారు. డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్లపైకి చేరి నిత్యం ఇరుగుపొరుగు వారి మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యలు తీర్చకపోతే దశలవారీగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం డిజిటల్ అసిస్టెంట్ రిజ్వాన్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి.నరసింహప్ప, లక్ష్మినారాయణ, స్థానిక మహిళలు లక్ష్మీదేవి, సాదిక్, కవిత, కృష్ణమూర్తి, అనూష, తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ

గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

లేపాక్షి, జూలై 28 ప్రభాతవార్త

లేపాక్షి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కరణం రామానందన్ మంగళవారం గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వారం వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే గర్భవతులకు ట్రస్ట్ ద్వారా భోజనవసతి కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా దాదాపు 65 మంది మహిళలకు పౌష్టికాహారాన్ని అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. కరణం రామానందన్ సేవా దృక్పథాన్ని ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, వైద్య సిబ్బంది, స్థానిక మిత్రమండలి కొనియాడారు.

ఘనంగా వైసీపీ నేత జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ప్రశాంత్

హిందూపురం జులై 28 ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.పి. ప్రశాంత్ గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. మూడు దశాబ్దాలుగా ప్రజా పోరాటాలు, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని చురుకైన నాయకునిగా గుర్తింపు పొందిన ప్రశాంత్ జన్మదిన కార్యక్రమానికి వైసీపీ కార్యకర్తలు, సన్నిహితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ కేక్ ను ఆయన కట్ చేశారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల్లో సూర్యనారాయణ గౌడ్, అశ్వర్థనారాయణ, నవీన్, వాల్మీకి లోకి, వెంకటేశ్వర్లు మొదలవారు పాల్గొన్నారు.

పంచాయతీ పరిపాలన అధికారి ఏ.వి.రమణకుమార్‌కు అవార్డు

- వ్యర్థ పదార్థాల నిర్వహణలో ఉత్తమ సేవలకు లభించిన గుర్తింపు

ఉరవకొండ, జూలై 28 ప్రభాతవార్త

ప్రసంసా పత్రం అందుకొంటున్న అధికారి

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామ పంచాయతీ పరిపాలన అధికారి ఏ.వి.రమణకుమార్ అవార్డు అందుకు న్నారు. గ్రామంలో వ్యర్థ పదార్థాల నిర్వహిణలో అందించిన ఉత్తమ సేవలకుగాను ఆయనకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ రాష్ట్ర అధికారులు డివిజినల్‌స్థాయి అవార్డు ను ప్రదానంచేసి ప్రసంసా పత్రం అందించింది. జిల్లా కేంద్రం అనంత పురంలోని జేఎన్‌టీయు ఎన్టీఆర్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సుధాకర్, జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీపీవో నాగరాజునాయుడు, ఈవోఆర్‌డీ సతీష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీఠాధిపతి జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి శివ గణారాధన

- సమాధివద్ద పూజలు నిర్వహించిన ఉత్తరాధికారి తదితరులు



సమాధివద్ద పూజల్లో పాల్గొన్న ఉత్తరాధికారి తదితరులు

ఉరవకొండ, జూలై 28 ప్రభాతవార్త

ఈనెల 18వ తేదీన శివైక్యం పొందిన ఉరవకొండలోని ప్రసిద్ధ గవిమఠ సంస్థానం 8వ పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి శివ గణారాధన కార్యక్రమం మంగళవారం మఠంలో భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసరాజేంద్రస్వామి, ఆదోని చౌకీ మఠం కళ్యాణిస్వామి ఆధ్వర్యంలో పీఠాధిపతి సమాధివద్ద (గద్దె) చిత్రపటాన్ని ఉంచి విశేష పూజలు నిర్వహించారు. సెప్టెంబర్ 3వ తేదీన పీఠాధిపతుల గురు పుణ్యస్మరణోత్సవం కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మఠాల స్వామీజీలు, భక్తులు, వీరశైవ, జంగమ సంక్షేమ సంఘాల బాధ్యులు, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బాటిల్తో నిరసన తెలిపిన రైతు

సకాలంలో రుణాలు చెల్లించిన రెన్యువల్ చేయని బ్యాంక్ ఉద్యోగులు

నిరసన తెలుపుతున్న దృశ్యం

బ్రహ్మసముద్రం జూలై 28 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తి గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై ఒక రైతు పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలిపారు తాను తీసుకున్న పంట రుణాలకు గత సంవత్సరంలో సకాలంలో రుణానికి సంబం ధించిన వడ్డీ చెల్లించిన తన పంటరుణం రెన్యువల్ చేసి వడ్డీ రాయితీ రైతుకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఈ సంవత్సరం రెన్యువల్ చేద్దామని వెళితే పోయిన సంవత్సరం రెన్యువల్ చేయకపోవడంతో వడ్డీ ఎక్కువగా వచ్చినట్టు బ్యాంక్ అధికారులు చెప్పడంతో రైతులకు తీసుకొన్న రుణం సకాలంలో చెల్లించిన యెడల వడ్డీ రాయితీ అందించాల్సిన బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు ప్రతి సంవత్సరం రైతులు తీసుకున్న రుణాలు వడ్డీ సకాలంలో చెల్లించిన బ్యాంక్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తూ రెన్యువల్ చేయకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని రైతులు కస్టమర్ల వద్ద కొందరు బ్యాంకు ఉద్యోగులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని రైతులు మండిపడ్డారు ఇప్పటికైనా సదరు బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు.

మెగా డీఎస్సీ పై బహిరంగ చర్చకు సిద్ధమా..?

మొదటిపేజీ తరువాయి... హామీ మేరకు మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేసి రికార్డు టైంలో దీనిని పూర్తి చేశామన్నారు. అయితే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేని వైసిపి ఇప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తాము ఇంటింటికి వెళ్లి వివరిస్తుంటే ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ప్రజలను స్పందనను చూసి వైసిపి నాయకులు ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే విమర్శలు చేశారు. మెగా డీఎస్సీ పై బహిరంగ చర్చకు సిద్ధమని ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారని.. అయితే ఇప్పటివరకు వైసీపీ నాయకులు చర్చకు రాకుండా రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు చేతనైతే ఆరోపణలు నిరూపించాలని లేకపోతే కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఇప్పటివరకు నాలుగు మెగా డీఎస్సీలు నిర్వహించారని ఒక్కచోట కూడా అవినీతి ఆరోపణ లేకుండా పూర్తి చేశారన్నారు. అదే బాటలోని మంత్రి నారా లోకేష్ కూడా అత్యంత పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించారని దగ్గుపాటి అన్నారు. డీఎస్సీ ని ఆపటానికి 238 కేసులు వైసిపి నాయకులు వేసినప్పటికీ వాటిని సమర్థవంతంగా మంత్రి నారా లోకేష్ ఎదుర్కొన్నారన్నారు. పేపర్ లీకేజీ అయిందని స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని ఇలా ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాటిలో ఏ ఒక్క దానికి కూడా వైసిపి నాయకుల వద్ద ఆధారాలు లేవన్నారు. అలాంటి ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని దగ్గుబాటి సూచించారు. వైసిపి హయాంలో గ్రూప్ 2 పోస్టులు భర్తీ చేస్తే అందులో 150 మంది నేటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైయస్ హయాంలో డీఎస్సీ నిర్వహిస్తే ఆరోజు కాంగ్రెస్ నేతల పిల్లలకి ఉద్యోగాలు వచ్చాయన్నారు. వైసిపి హయాంలో జరిగిన సచివాలయ ఉద్యోగాల నియామకాల్లో కూడా అనేక అక్రమాలు జరిగాయన్నారు. కనీసం ఐదేళ్లలో ఒక ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇవ్వలేదని... ప్రైవేట్ కంపెనీలు రాలేదు ఉద్యోగాలు ఉద్యోగాలు రాలేదని అన్నారు. చంద్రబాబు, లోకేష్ కృషితో 25 లక్షల కోట్ల పెట్టుబడులు, 25 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రత్యేకించి విద్యాశాఖలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ఆరోజు ఉపాధ్యాయులను వైన్ షాపుల వద్ద, టాయిలెట్ల వద్ద నిలబెట్టి అవమానించారన్నారు. ఈరోజు అదే ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు తగిన గౌరవం కల్పించిన నాయకుడు మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లోకి విద్యార్థులు చేరుతున్నారన్నారు. ఒక్క అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనే 4,000 మంది విద్యార్థులు ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు.

రామ్ చరణ్ కోసం శివాలయంలో పూజలు

హిందూపురం జులై 28 ప్రభాతవార్త

పాలాభిషేకం చేస్తున్న చక్రవర్తి

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చేతికి కోయంబత్తూర్ లో శస్త్ర చికిత్స సందర్భ ంగా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ హిందూపురం శ్రీకంఠ పురంలో శ్రీకంఠేశ్వర స్వామి సన్నిధా నం నందు మెగా యూత్ ఫోర్స్ రా యలసీమ అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు చక్రవర్తి ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా స్వామివారికి 101 టెంకాయ సమర్పించి, పాలాభిషేకం చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో మెగా సీని యర్ అభిమానులు నాగరాజు, ఆది నారాయణ, లక్ష్మి నారాయణ, వెంక టేషులు, మెగా ఫాన్స్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు గేట్స్ చేయూత

- కళాశాల చైర్మన్ రఘునాథరెడ్డి

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

గుత్తి, జూలై 28 ప్రభాతవార్త

గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు స్వర్గీయ వీకే సుధీర్‌రెడ్డి ఆశయ సాధన మేరకు ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ఇంజనీరింగ్ విద్యను అందిస్తామని కళాశాల చైర్మన్ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గం పెద్దవ డుగూరు గ్రామానికి చెందిన విద్యార్థిని భావన ఏపీ సెట్‌లో ర్యాంకు సాధించలేకపోయింది. అయితే ఆ విద్యార్థిని 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో కనబరిచిన ప్రతిభకు కళాశాల యాజమాన్యం ఉచితంగా నాలుగు సంవత్సరాల పాటు ఇంజనీరింగ్ కోర్సులో విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించింది. ప్రతిభ ఉన్న విద్యార్థులకు తమ కళాశాల చేయూతనిస్తుందని కరస్పాండెంట్ వికె పద్మావతి, డైరెక్టర్ వికె వాణి పేర్కొన్నారు. యాజమాన్యం మానవతా దృక్పథం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తలకిందులుగా డాక్యుమెంట్‌రైటర్లు నిరసన

డాక్యుమెంట్‌రైటర్లు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

గుత్తి, జూలై 28 ప్రభాతవార్త

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ సర్వీస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జారీచేసిన జీవో నెంబర్ 369ని తక్షణం వద్దు చేయాలని డాక్యుమెంట్‌రైటర్స్ నాయకులు శ్రీకరం నరేష్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం వారు తలకిందులుగా ఉంటూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గద్దల నాగరాజు, గండికోట రఘు, సాయి రంగస్వామి, తాజుద్దీన్, ఇలియాజ్, సిరాజ్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇరువురు గంజాయి విక్రేతలు అరెస్ట్

- 1150 గ్రాముల గంజాయి స్వాధీనం
- అర్బన్ సిఐ రామారావు

నిందితులను అరెస్ట్ చేసిన దృశ్యం

గుత్తి, జూలై 28 ప్రభాతవార్త

గుత్తి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఇరువురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసి వారి వద్ద నుండి గంజాయి స్వాధీన పరుచుకున్నట్లు అర్బన్ సిఐ రామారావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. గుంతకల్లుకు

స్వాధీనం చేసుకున్న గంజాయి

చెందిన షికారి అంజి అనే వ్యక్తి నుండి గంజాయి కొనుగోలు చేసుకుని గుత్తికి వచ్చిన అమృత్ థియేటర్ వెనుక నివాసముండే సాయిరాం, కే.ఊబిచెర్ల గ్రామానికి చెందిన ఓబయ్య అనే నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 1150 గ్రాముల గంజాయిని స్వాధీనపరుచుకున్నామని సిఐ తెలిపారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నాడని అతన్ని త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐలు సురేష్‌బాబు, అమీర్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ-2025 నియామక ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై

స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలి

మొదటిపేజీ తరువాయి... నియామకాలపై ప్రజల్లో విశ్వాసం నెలకొల్పడం ప్రభుత్వ కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యపై ప్రచారం ఒకలా ఉండగా, విద్యార్థుల నమోదు గణాంకాలు మరోలా కనిపిస్తున్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేరికలు పెరుగుతున్న పరిస్థితి ప్రభుత్వ విద్యపై ప్రజల్లో ఏర్పడుతున్న ఆందోళనను సూచిస్తోందన్నారు. కేవలం ప్రచార కార్యక్రమాలతో కాకుండా విద్యా రంగంలో స్పష్టమైన ఫలితాలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమ పథకాల అమలులో కూడా ప్రభుత్వం పూర్తి స్థాయిలో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ హామీలు అందేలా చర్యలు తీసుకోవాలని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా చూడాలని కోరారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను కొనసాగించి, వాటిని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అనేక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తాగునీరు, విద్యా సామగ్రి వంటి అంశాల్లో సమస్యలు కొనసాగుతున్నాయని, వాటి పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉపాధి హామీలు, ఆర్థిక భరోసా పథకాలను కూడా ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరుతూ, విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే రాష్ట్ర భవిష్యత్తును నిర్మించగలమని తెలిపారు. చివరగా, విద్య అనేది ప్రతి చిన్నారి ప్రాథమిక హక్కు అని పేర్కొంటూ, ప్రభుత్వ విద్యను పరిరక్షించడం అంటే సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల భవిష్యత్తును కాపాడటమేనని అన్నారు. విద్యా రంగంలో నాణ్యత, పారదర్శకత, సమాన అవకాశాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు.

అసత్యాల వైసీపీకి రాజకీయ సమాధి తప్పదు

మొదటిపేజీ తరువాయి... చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 148 రోజుల్లోనే అత్యంత పకడ్బందీగా డీఎస్సీ నిర్వహించి 16,347 మందిని ఉపాధ్యాయ పోస్టుల్లో నియమించిన ఘనత లోకేష్ బాబుకు దక్కుతుందన్నారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా పరీక్షల నిర్వహణ, నియామకాలు జరిగాయని పేర్కొన్నారు. వాస్తవానికి జాతీయస్థాయిలో జరిగే జేఈఈ లాంటి పరీక్షల నిర్వహణలో అనుసరించిన అత్యుత్తమ ప్రమాణాలు డీఎస్సీలో కూడా పాటించడం జరిగిందన్నారు. డీఎస్సీపై అసత్య ఆరోపణలు చేయడం వైసీపీ దుర్మార్గ ధోరణికి నిదర్శనమన్నారు. వైసీపీ చేస్తున్న ఆరోపణలు ఉపాధ్యాయ వృత్తిలో కొలువుదీరిన అత్యంత ప్రతిభావంతులను అవమానించడమే అవుతుందన్నారు. వారి మేధస్సును పరిహసించడం కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. జగన్ తన హయాంలో 23 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రగల్భాలు పలికిన ఆయన, 2024 ఎన్నికల ముందు ఉత్తుత్తి నోటిఫికేషన్ ఇచ్చి మిన్నకుండిపోయారని విమర్శించారు. నిరుపేదలు ఎక్కువగా చదువుకుంటున్న ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, మౌలిక వసతులు కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం జరిగిందన్నారు. అలాగే పాఠశాలల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలను కూడా మెరుగుపరుస్తున్నామన్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందించగలిగితే సామాన్యుడు కూడా అత్యున్నత స్థాయికి ఎదగగలడన్నారు. పేదరికం నుంచి వచ్చిన వారికి సమాజం పట్ల గౌరవం, విశ్వాసం ఎక్కువన్నారు. అలాంటి వారి వల్ల సమాజానికి చాలా మేలు జరుగుతుందని చెప్పడానికి అట్టడుగు స్థాయి నుంచి భారత రాజ్యాంగ నిర్మాతగా ఎదిగిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గొప్ప ఉదాహరణ అన్నారు. అదే లక్ష్యంతో నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి విద్యా ప్రమాణాలు మెరుగుపరుస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్న భరోసా ఇవ్వడం వల్లే ప్రైవేటు పాఠశాలలకు సమానంగా సర్కారు బడులు ఎదుగుతున్నాయన్నారు. ఒక ఆదర్శమైన విద్యా వ్యవస్థను రాష్ట్రంలో తీర్చిదిద్దడానికి లోకేష్ నిత్యం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. మెరుగుపడుతున్న విద్యా వ్యవస్థ గురించి తక్కువ చేసి, నీచంగా మాట్లాడడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇలాంటి ఆరోపణలతో ఆ పార్టీకి రాజకీయ సమాధి తప్పదని ఎమ్మెల్యే కాలవ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు గుర్రప్ప, సెంట్రల్ స్టోర్ అధ్యక్షుడు పూజరి శివ లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలో ఊపందుకున్న అభివృద్ధి

మురడి ఆంజనేయ స్వామికి పూజలు తెరిపిస్తున్న ఎమ్మెల్యే కాలవ

డోర్ టు డోర్ తెలుగుదేశం లో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాలవ

డి.హిరేహాళ్ జులై 28 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబునాయుడు పాలనలో అభివృద్ధి, సంక్షేమం ఊపొందుకున్నాయని ప్రభుత్వం విప్, రాయదుర్గం ఎమ్మెల్యే ఆలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం డి.హిరేహాళ్ మండలం మురడి గ్రామంలో తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళి రాజు, ఎంపీటీసీ, మండల క్లస్టర్ ఇంచార్జ్ గంగాధర, పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగ ప్రసిద్ధి చెందిన మురడి ఆంజనేయస్వామి దేవాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకొని అనంతరం డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొని, అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీచేస్తూ ఓటర్లకు వివరించారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాలవ ప్రసంగిస్తూ వైకాపా పాలనలో స్తంభించిన అభివృద్ధికి కూటమి ప్రభుత్వ హయాంలో తిరిగి రెక్కలోచ్చాయాని వచ్చాయని ఎమ్మెల్యే కాలవ తెలిపారు. ముఖ్యమంత్రి సారాధ్యంలో గ్రామాలు, పట్టణాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో మురడి గ్రామంలో సుమారు రూ.2 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే వివరించారు. మురడి నుంచి తమ్మెపల్లికి తారు రోడ్డు నిర్మించామని, ఉపాధి హామీ పథకం కింద రూ.30 లక్షలతో గ్రామంలో సిమెంట్ కాంక్రీట్ రోడ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే మండల నిధుల నుంచి మరో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని, తాగునీటి పథకాన్ని పునరుద్ధరించామని తెలిపారు. దాతల సహకారంతో ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ పనులను కూడా చేపట్టామని ఎమ

03ATP27.qxd:03ATP27.qxd 29/07/26 10:13 PM Page 1

అనంతపురం జిల్లా రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ అడహాక్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం న్యూటౌన్, జులై 28 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ (ఆర్టీఎఫ్ఏపీ) అనంతపురం జిల్లా ప్రాంతీయ సమావేశం మంగళవారం అనంతపురం ఉపాధ్యాయ భవన్ ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు ఎం.నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఐఫియా చీఫ్ ప్యాట్రన్ సుబ్బారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు, రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోకన్వీనర్ చంగల్‌రాయ మందాడి, ఆర్టిఎఫ్ నంద్యాల జిల్లా ప్రతినిధి అబ్దుల్ వహీద్, చిత్తూరు జిల్లా ప్రతినిధి మురళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జి.రవీంద్ర, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ నాయక్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల పెన్షన్, వైద్య సదుపాయాలు, పెండింగ్ బకాయిలు వంటి ముఖ్య సమస్యల పరిష్కారం కోసం రిటైర్డ్ ఉపాధ్యాయులు సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీఆర్టీఎఫ్‌ను బలోపేతం చేసి,రిటైర్డ్ ఉపాధ్యాయుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా అడహాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ జోసెఫ్, జిల్లా కోకన్వీనర్ ఎం.నరసింహులు, సభ్యులు రామాంజనేయులు, వి.వి.సుబ్బారెడ్డి, రామకృష్ణ, సదాశివ, సాయిబాబా, సూర్యనారాయణ, విశ్వనాథ్, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సమావేశంలో పాల్గొన్న నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు అభినందించి, జిల్లా వ్యాప్తంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసి, రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, ఆదినారాయణ, నాగేంద్ర రెడ్డి, ఫణీంద్రనాథ్ రావుతో పాటు జిల్లాలోని పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.వి.డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థికి టీసీఎస్ సంస్థలో ఉద్యోగం

నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జులై 28 ప్రభాతవార్త

ప్రముఖ బహుళ జాతీయ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్వహించిన నియామక ప్రక్రియలో అనంతపురంలోని ఎస్.వి.డిగ్రీ, పీజీ కళాశాల 2023-2026 బ్యాచ్‌కు చెందిన విద్యార్థి జి.విజయ్ కుమార్ ప్రతిభ కనబరిచి ట్రైనీ బీపీఎస్ హోదాలో 1.6 లక్షల వార్షిక వేతనంతో హైదరాబాద్లో ఉద్యోగాన్ని సాధించాడని కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి ఎంపికైన విద్యార్థిని అభినందిస్తూ, విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకొని మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలియజేసారు. ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ఏ.వి.ప్రసాద్, ప్రసంగిస్తూ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.శ్రీనాథ్ ఎంపికైన విద్యార్థిని అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.సాయిరామ్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవంలో హారిజన్ వ్యాలీ విద్యార్థిని అర్విత

అనంతపురం న్యూటౌన్, జులై 28 ప్రభాతవార్త

మొక్కలు నాటుతున్న విద్యార్థిని అర్విత

నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్- అనంతపురం జిల్లా, ప్రకృతి గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం -2కె రన్" కార్యక్రమంలో హారిజన్ వ్యాలీ ఫ్యూచర్ స్కూల్ విద్యార్థిని అర్విత ఉత్సాహంగా పాల్గొని ప్రశంసాపత్రాన్ని అందుకుంది. బుధవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రీప్రైమరీ విద్యార్థులు మొక్కలు నాటి ప్రకృతి పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. పాఠశాల చైర్మన్, వ్యవస్థాపకులు సోమశేఖర్ రెడ్డి, కరస్పాండెంట్, డైరెక్టర్ రోహిత్ రెడ్డి, ప్రిన్సిపాల్, రేఖా ఫులేకర్ విద్యార్థిని అర్వితతో పాటు ప్రీప్రైమరీ చిన్నారులను, ఉపాధ్యాయులను అభినందించారు. మొక్కలు నాటుదాం-ప్రకృతిని కాపాడుదాం-పచ్చని భవిష్యత్తును నిర్మిద్దాం." అంటూ నినాదాలు చేశారు.

శాకాంబరీదేవిగా దర్శనమిచ్చిన హింగూలికంబా

- అమ్మవారికి విశేష పూజలు

పామిడి, జులై 28 ప్రభాతవార్త

శాకాంబరీదేవిగా అలంకరణలో హింగూలికంబా

పట్టణంలోని శ్రీ విఠోబ స్వాముల దేవాలయంలో వెలసిన హింగూలికంబా అమ్మవారు ఆశాడమాసం మంగళవారంను పురష్కరించుకుని శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భావసార క్షత్రీయుల కుల దేవత హింగూలికంబా అమ్మవారికి మహిళలు కుంకుమ అర్చనలు విశేష పూజలు జరిపారు. కూరగాయలు, ఆకుకూరలు, పూలతో అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించారు. లలిత సహస్ర నామ పారాయణం, ధుర్గ పారాయణం గావించారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులను సమర్పించుకుంటూ పూజలు చేపట్టి అమ్మవారి కృపకు పాత్రులై తీర్థప్రసాదాలను స్వీకరించారు. భావసార క్షత్రీయ కుల దేవతైన హింగూలికంబా అమ్మవారికి జిల్లాలోనే ఏకైక దేవాలయం పామిడి పట్టణంలో ఉండటం విశేషం.

గుంటి క్రింద సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు..

గార్లదిన్నె, జులై 28, ప్రభాత వార్త:

గుంటి క్రింద సుబ్రహ్మణ్య స్వామివారికి ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న దివ్య మూర్తి

గార్లదిన్నె మండలంలోని కోటంక గ్రామంలో వెలసిన గుంటి క్రింద సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు వైద్యం రామాచార్యులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేసి విశేషంగా పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

భక్తుల గీతాలాపనల మద్య స్వామి వారి ఊరేగింపు

ఐరావత వాహన సేవలో శ్రీ పాండురంగస్వామి.

పామిడి, జులై 28 ప్రభాతవార్త

భక్తుల గీతాలాపనల మద్య మంగళవారం శ్రీ పాండురంగస్వామిని పురవీధులో ఊరేగించారు. ఆశాడమాసం బ్రహ్మోత్సవాలను పురష్కరించుకుని శ్రీరంగ సుభేఫిర్కా భగవాన్‌దాస్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం శ్రీ పాండురంగస్వామి ఐరావత వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. భావసార క్షత్రీయులకు సంబందించి రెండు పాండురంగస్వామి దేవాలయాలు ఉండగా ఆశాడమాసంలో ప్రతిఏటా శ్రీవారి బ్రహ్మోత్సవం రోజున ఉట్లపరుషను నిర్వహించటం ఇక్కడ ఆనవాయితీ. వాహన సేవల్లో పాల్గొంటున్న భక్తులు కోరిన వరాలను ప్రసాధిస్తాడని శాస్త్రాలు చెబుతుండటంతో మంగళవాయిద్యాలతో తమ ఇళ్ళ ముంగిటకే వస్తున్న శ్రీ పాండురంగస్వామిని ప్రజలు దర్శించుకుని పూజలు చేపడుతూ తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి అంగదాల కృష్ణయ్య, అర్చకులు, ఆలయ సిబ్బంది, భావసార క్షత్రీయులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద తయారు కావాల్సిందే..!

సమావేశానికి హాజరైన అధికారులు, పంచాయితీ కార్యదర్శిలు

మొదటిపేజీ తరువాయి... తరలించాలన్నారు. ప్రతి గ్రీన్ అంబాసిడర్ చెత్తను ఎరువుగా మార్చి వాటి నుంచి పంచాయితీలకు ఆదాయాన్ని చేకూర్చాలని సూచించారు. 45 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ఇంటింటి చెత్త సేకరణలో తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని శుభ్రంగా ఉంచడమే కాకుండా గ్రామాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. అదే విధంగా స్వచ్ఛ రథాలు, స్వచ్ఛ పథకం కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సిఈఓ విజయలక్ష్మి, ఉమ్మడి జిల్లాల డిపిఓలు, పిడిఓలు, ఎంపిడిఓలతోపాటు కార్యదర్శిలు హాజరయ్యారు.

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మొదటిపేజీ తరువాయి... ప్రతిరోజూ నడిపేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ప్రధానంగా రైలు సర్వీసుల విస్తరణ ఫ్రీక్వెన్సీ పెంపు, ప్రస్తుతం ప్రత్యామ్నాయ రోజుల్లో నడుస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్ (17211/17212)ను ప్రతిరోజూ నడపాలి, బెంగళూరు-విజయవాడ మధ్య అనంతపురం మీదుగా కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించాలి విజ్ఞప్తి చేశారు. తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ (17607) ను కర్నూలు వరకు కాకుండా గుంతకల్లు వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా అనంతపురం రైల్వే స్టేషన్‌లో రాజధాని ఎక్స్‌ప్రెస్ (22691/22692) మరియు యశ్వంత్‌పూర్ - బీదర్ ఎక్స్‌ప్రెస్ (16571/16572) కు నిలుపుదల కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గుత్తి రైల్వే స్టేషన్‌లో కొంగు ఎక్స్‌ప్రెస్ (12647/12648)కు హాల్ట్ మంజూరు చేయాలని కోరారు. రాయదుర్గం స్టేషన్ నందు పలు రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని కోరారు. ప్రయాణికుల సౌకర్యార్థం కోవిడ్‌కు ముందు అమలులో ఉన్న విధంగానే గుంతకల్లు-తిరుపతి ప్యాసింజర్ (57403/57404) రైలును ఉదయం 7.00 గంటలకు గుంతకల్లు నుండి బయలుదేరేలా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బెంగళూరు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలకు అనుకూలంగా ఉదయం సర్వీసు, తిరుగు ప్రయాణానికి మధ్యాహ్నం బెంగళూరు నుండి సౌకర్యవంతమైన రైలు ఏర్పాటు చేయాలని కోరారు. కల్లూరు స్టేషన్‌లో పలు రైళ్లకు నిలుపుదల కల్పించడం, జడ్పి హైస్కూల్ సమీపంలో రౌండ్ గేట్ ఏర్పాటు, వర్షాకాలంలో ఇబ్బందులు కలిగిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ (రబ్) మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే రాయలచెరువు రైల్వే స్టేషన్‌లో కొత్త హాల్ట్‌ల కోసం, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిరుమల ఎక్స్‌ప్రెస్, చెన్నైకు వెళ్ళు రైళ్లను, ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ గుంతకల్లు విశాఖ పట్నం రైళ్లతో పాటు మరికొన్ని రైళ్లకు నిలుపుదల (హాల్ట్) కల్పించాలని, రాయలచెరువు స్టేషన్‌లో గతంలో నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించడంతో పాటు మరిన్ని రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని, ప్రయాణికుల కోసం రెండు బెర్తుల రిజర్వేషన్ కోటాను తిరిగి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గార్లదిన్నె-పెనకచర్ల, బళ్లారి గేట్, కశాపురం రోడ్డు, గుంతకల్లు పరిసర ప్రాంతాల్లో అవసరమైన ఫ్లైఓవర్లు, రైల్వే అండర్ బ్రిడ్జిలు (రబ్), రోడ్డు వసతుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బ్రిటిష్ కాలం నాటి గుంతకల్లు-కసాపురం పాత వంతెన స్థానంలో కొత్త, విశాలమైన వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం మీదుగా నడుస్తున్న మెము రైలు (66559/66560)లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఉన్న 12 కోచ్‌లకు అదనంగా మరో నాలుగు కోచ్‌లు జోడించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వినతిని సానుకూలంగా స్వీకరించిన కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన అన్ని అంశాలను రైల్వే బోర్డు అధికారులతో సమీక్షిస్తామని తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల సమయంలోనే రైల్వే బోర్డు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎంపీని ఆహ్వానించి, ప్రతి అంశాన్ని పరిశీలించి సాధ్యమైన మేరకు పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లాకు మెరుగైన రైల్వే సదుపాయాలు, మౌలిక వసతుల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.

జిల్లా ఉన్నత స్థాయి కమిటీలో జూనియర్లకు అందలం...!

- అది కూడా ఒకే నియోజకవర్గంలో ఐదుగురికి చోటు - అందులో నలుగురు ఎంఈఓ1 లు

- కేవలం ఎంఈఓ 2 లు ఇద్దరు మాత్రమే - కమిటీలు ఏర్పాటు పై తీవ్ర విమర్శలు

అనంతపురం న్యూటౌన్, జూలై 28 ప్రభాతవార్త

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో లోపాలు (సమస్యలు) గుర్తించి పరిష్కార మార్గాలు చూపడానికి ఏర్పాటుచేసిన జిల్లా ఉన్నత స్థాయి కమిటీలో జూనియర్లకు అందలం ఎక్కించారు. అంతేకాకుండా ఒకే నియోజవర్గంలో ఐదు మండలాల ఎంఈఓ లను ఎంపిక చేయడం ఎంపిక చేయడం పలు విమర్శలకు దారితీస్తుంది.



జిల్లా కమిటీ జాబితా , సబ్ కమిటీల జాబితా

జిల్లాలో 1752 పాఠశాలల్లో 1,67,434 మంది విద్యార్థులు చదువుతున్నారు. మే 20న విద్యాశాఖమంత్రి డీఈఓలు, ఏపీసీలతో సమావేశం నిర్వహించి అనంతపురం జిల్లాలోని పాఠశాలలో లోపాలు గుర్తించడానికి, వాటి పరిష్కారానికి మార్గాలు చూపడానికి జిల్లా ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని విద్యాశాఖ కమిషనర్ ను ఆదేశించారు. దీంతో జిల్లా ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి పంపించాలని ఇన్ ఛార్జ్ డీఈఓ ను కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటు చేస్తూ పంపించడంతో ఆ కమిటీని నియామిస్తూ గత నెల 20న కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి అనుబంధంగా ఆరు సబ్ కమిటీలను 32 మందితో ఏర్పాటు చేస్తూ ఈనెల 15న ఇన్ ఛార్జ్ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇది జిల్లా ఉన్నత స్థాయి జిల్లా కమిటీ:

అనంతపురం జిల్లా ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్ గా జిల్లా కలెక్టర్, కో చైర్మన్ గా ఏపీ ఓపెన్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఆర్. నరసింహారావు, కమిటీ సభ్యులుగా కడప ఆర్జేడీ శామ్యూల్, కళ్యాణదుర్గం ఎంఈఓ1 బి. విజయ కుమారి, బుక్కరాయసముద్రం ఇన్ ఛార్జ్ ఎంఈఓ1 ఎస్. నవీద, డి. హిరేహాల్ మండలం మురడి జెడ్పిహెచ్ఎస్ హెచ్ఎం వి. గురుముని కృష్ణ, రాప్తాడు మండలం బండమీదపల్లి జడ్పిహెచ్ఎస్ హెచ్ఎం పి.ఆర్. వి .ప్రసాద్, ఆర్డిటి సంస్థ నుండి మోహన్ మురళి, రూరల్ అండ్ ఎన్విరాన్మెంట్ డెవలప్మెంట్ సంస్థ నుండి సి. భానుజా, కేపీఎంజి కన్సల్టెంట్ నుండి సురిల్ షా, కన్వీనర్ గా జిల్లా విద్యాశాఖ అధికారి.

ఓకే నియోజకవర్గంలో నలుగురు ఎంఈఓ1లు:

యాక్సెస్ మరియు నమోదు సబ్ కమిటీలో గార్లదిన్నె ఎంఈఓ2 వెంకటరమణ నాయక్, ఉపాధ్యాయుల నాణ్యత శిక్షణ, లో యల్లనూరు ఎంఈఓ1 ఎల్. పి. చంద్రశేఖర్, మౌలిక సదుపాయాలు మరియు సౌకర్యాలు సబ్ కమిటీలో నార్పల ఎంఈఓ 1 క్రిష్ణయ్య, గవర్నెన్స్ మరియు మానిటరింగ్ సబ్ కమిటీలో బుక్కరాయసముద్రం ఇన్ ఛార్జ్ ఎంఈఓ1 బి. నవీద, పుట్లూరు ఎంఈఓ1 శ్రీదేవి ... ఇలా సింగనమల నియోజకవర్గం వర్గానికి చెందిన నలుగురు ఎంఈఓ1 లు, ఒకరు ఎంఈఓ2 మొత్తం ఐదు మంది కమిటీలో ఉన్నారు. ఇవి జిల్లా కమిటీ నా? లేక నియోజకవర్గ కమిటీ నా? అని కమిటీ జాబితాను చూసిన ప్రతి హెచ్ఎం, ఎంఈఓ, టీచర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్లను కాదని జూనియర్లకు చోటు:

జిల్లా ఉన్నత స్థాయి కమిటీలో దాదాపు మూడేళ్ల క్రితం హెచ్ఎం గా పదోన్నతి పొంది బుక్కరాయసముద్రం ఇన్ ఛార్జ్ ఎంఈఓ1 గా పనిచేస్తున్న బి. నవీద , డి. హిరేహాల్ మండలం మురడి జడ్పిహెచ్ఎస్ హెచ్ఎం గురుముని కృష్ణ కూడా దాదాపు మూడేళ్ల క్రితం హెచ్ఎం గా పదోన్నతులు తీసుకున్నారు. వీరికి జిల్లా స్థాయి కమిటీలో చోటు కల్పించారు. దాదాపు పది నుండి 15 సంవత్సరాలు హెచ్ఎం గా సర్వీసు ఉన్న సీనియర్ హెచ్ఎం గంధమనేని శ్రీనివాసులు తో పాటు చాలామంది హెచ్ఎంలు, ఎంఈఓ లు ఉన్నారు. కానీ ఆ ఇద్దరు జూనియర్లకు జిల్లా కమిటీలో చోటు కల్పించడంపై పలు విమర్శలకు దారితీస్తుంది.

గుత్తి డిప్యూటీ డీఈఓకు చోటు లేదు:

జిల్లా ఉన్నతస్థాయి కమిటీ తో పాటు ఆరు సబ్ కమిటీ లలో గుత్తి డిప్యూటీ డీఈఓ లక్ష్మన్న కు కూడా చోటు లేదు. ఆయన గవర్నమెంట్ సీనియర్ హెచ్ఎం, ఎంఈఓ1 గా పనిచేసినప్పటికీ చోటు దక్కలేదు. అదేవిధంగా అదే డివిజన్ లో ఒక ఎంఈఓ,ఒక హెచ్ఎం కూడా చోటు దక్కకపోవడం గమనార్హం.

ఆ మూడు సబ్ కమిటీల్లో ఎంఈఓ 2లు లేరు :

ఆరు సబ్ కమిటీల్లో యాక్సెస్ మరియు నమోదు, మౌలిక సదుపాయాలు మరియు సౌకర్యాలు , చేరిక మరియు సంక్షేమం వంటి ఈ మూడు సబ్ కమిటీల్లోని అంశాలు ఎంఈఓ2 జాబ్ చార్ట్ లో ఉన్నాయి. కానీ ఆ మూడు సబ్ కమిటీల్లో ఒక కమిటీలో మాత్రం ఒక ఎంఈఓ 2 ఉన్నారు. మిగిలిన రెండు కమిటీల్లో ఎంఈఓ 2 లు లేకపోవడం విశేషం. ఈ జిల్లా కమిటీ తో పాటు సబ్ కమిటీల వివరాలు వార్త దినపత్రికలో రావడంతో అందులో సభ్యులను చూసి పలువురు విద్యాశాఖ అధికారులతో పాటు ఎంఈఓ లు, హెచ్ఎంలు, టీచర్లు కమిటీలు ఏర్పాటు చేసిన అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి కమిటీలను పారదర్శకంగా ఏర్పాటు చేస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

ఆ కమిటీ లిస్టు నాకు తెలియదు: ఇన్ ఛార్జ్ డీఈఓ శ్రీనివాసరావు

జిల్లా ఉన్నత స్థాయి కమిటీ లిస్టు నాకు కూడా సరిగ్గా తెలియదు. అందులో ఎవరు ఉన్నారు, ఎవరు లేరు అన్నది కూడా నాకు సరిగ్గా తెలియదు. ఇప్పటివరకు ఆ కమిటీ గురించి నాకు తెలియదు. ఆదివారం జరిగిన రెండో సమావేశానికి మాత్రమే నన్ను పిలిచారు. కమిటీల జాబితాలపై పలువురు సీనియర్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. కమిటీల్లో కొన్ని మార్పులు, చేర్పులు కూడా చేస్తాం.

గుండుమలకు గవర్నర్ కోటాలో ఈసారైనా ఎమ్మెల్సీ పదవి దక్కేనా!

చంద్రబాబునాయుడు అరెస్టు చేసినప్పుడు ధర్నా చేస్తున్న మాజీ ఎంఎల్‌సి ఫైల్‌ఫోటోలు

మొదటిపేజీ తరువాయి... మూడుసార్లు ఎమ్మెల్సీగా, అసెంబ్లీ బిసి వెల్ఫేర్ చైర్మన్ గా విధులు నిర్వహించి తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకొని నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారూ..సుదీర్ఘ రాజకీయ అనుభవం ఆయనకి సొంతంగా మడకశిర నియోజకవర్గంలో పేరుంది. నియోజకవర్గంలో ఏ పార్టీ నాయకులైన కార్యకర్త నైనా పేరు పెట్టి పిలిచి ఆప్యాయతగా పలకరించే నాయకుడిగా పేరుంది. గ్రామస్థాయి నుండి నాయకులు కార్యకర్తలు చెప్పిన విషయాన్ని పరిశీలిస్తూ పైరవీలకు తావు లేకుండా మడకశిరలో తిరుగులేని నాయకుడిగా అధికారంతో ప్రమేయం లేకుండా ప్రతినిత్యం తనను నమ్ముకుని వచ్చే ప్రజలకు అండగా నిలబడటమే ఆయనపై అభిమానం పెరగడానికి ముఖ్య కారణం అని చెప్పవచ్చు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో కొంతమంది నాయకులు పార్టీని విడి వెళ్లినా కూడా తాను మాత్రం టిడిపిలోనే ఉంటూ నాయకులను కార్యకర్తలను కంటికి రెప్పల కాపాడుకొంటూ వచ్చారు. వైకాపా ప్రభుత్వం లో అనేక ఇబ్బందులను సృష్టించిన, ఆర్థికంగా దెబ్బ తీసేందుకు ప్రయత్నం చేసినా,కార్యకర్తలపై కేసులు బనాయించిన కూడా తనున్నానని కార్యకర్తలకు భరోసా ఇచ్చిన నాయకుడిగా గుర్తింపు ఉంది. పార్టీ అధికారంలో లేనప్పుడు జిల్లా స్థాయి ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను సత్య సాయి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ముఖ్య నాయకుల సమక్షంలో మడకశిరలో కార్యక్రమాన్ని నిర్వహించి అధిష్టానం మన్నలను పొందారు. విధాన మండలిలో వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లును తీసుకొచ్చిన సమయంలో డబ్బుకు ఆశపడి కొందరు ఎమ్మెల్సీలు అధికార వైకాపా వైపు నిలబడిన, తనకు టిడిపి పార్టీ ముఖ్యమని చంద్రబాబు నాయకత్వమే తనకుకావాలనే లక్ష్యంతో బిల్లుకు వ్యతిరేకంగా నిలబడి చంద్రబాబుతో శభాష్ అని సన్మానం కూడా చేయించుకున్నటువంటి ఘనత గుండుమలకే దక్కుతుంది. వైకాపా ప్రభుత్వం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసిన సమయంలో దాదాపు 60 రోజులపాటు చంద్రబాబును జైలు నుంచి బయటికి వచ్చేవరకు మడకశిర నియోజకవర్గంలో ఐదు మండలాల్లోప్రతినిత్యం నిరసనలు, రిలే నిరాహార దీక్షలు, పాదయాత్రలు, మౌనదీక్షలు చేపట్టి చంద్రబాబుకు, యువ నాయకుడు లోకేష్ కు ఆనాడు అండగా నిలిచారు. మడకశిరలో నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పోలీసులు అరెస్టు చేసి పెనుకొండకు తీసుకెళ్లడం వంటి సంఘటనలను ఎదుర్కొని చంద్రబాబు నాయకత్వాన్ని బలపరిచిన నాయకుడిగా గుర్తింపు ఉంది. చంద్రబాబు అరెస్ట్ అయిన సందర్భంలో జైలు నుంచి బయటికి వచ్చేవరకు ప్రతినిత్యం నిరసనలు తెలియజేయడంతో పాటు ప్రభుత్వంపై మండిపడిన సంఘటనలు అనేకం. వైకాపా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ కోసం కష్టపడి పనిచేశారు. 2024 ఎన్నికల్లోవైకాపా అభ్యర్థిగా ప్రకటన చేసినప్పటినుండి నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థిగా బలంగా ప్రచారం చేస్తే, టిడిపి అభ్యర్థిగా కేవలం 15 రోజుల వ్యవధిలో ఎమ్మెస్ రాజును అధిష్టానం ప్రకటించిన తక్షణం పార్టీ ఇన్చార్జిగా గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెస్ రాజును వెంటబెట్టుకుని నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించి, టిడిపి ఇన్చార్జిగా ప్రత్యేక బాధ్యతలు తీసుకొని నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి ఎమ్మెస్ రాజును గెలిపించుకుని తన సత్తాను చూపించారు. ఎన్నికల్లో ఎమ్మెస్ రాజును గెలిపించుకుని రావాలని అధిష్టానం ఆదేశిస్తే తూచా పాటించి అధినేత, యువనేత పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకున్న వ్యక్తిగా పేరుగాంచారు. సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు, టిటిడి బోర్డ్ సభ్యుడు,ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు సమిష్టిగా నియోజకవర్గ అభివృద్ధి వైపే తమ లక్ష్యంగా ఇరువురి సమక్షంలో మడకశిర నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అభిప్రాయం ఉంది. అయితే ముఖ్యంగా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలైనా సీనియర్ నాయకుడు పార్టీ కోసం కష్టపడి పనిచేసిన గుండుమల తిప్పేస్వామికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ లు గుర్తింపు ఇవ్వలేదని కార్యకర్తల్లో తీవ్ర అసంతృప

04ATP13.qxd:04ATP13.qxd 29/07/26 10:15 PM Page 1

మహిళా ఆర్థిక సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, జూలై 28, ప్రభాతవార్త

మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబంతోపాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మన డబ్బులు – మన లెక్కలు ప్రచార కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తిలో మెప్మా మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీకి ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళ పొదుపు అలవాటు పెంపొందించుకుని, కుటుంబ ఆదాయ-వ్యయాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలు తమ ఆర్థిక వ్యవహారాలను తామే నిర్వహించేలా అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం "మన డబ్బులు – మన లెక్కలు" కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారత కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ, మహిళలు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ పొదుపు, పెట్టుబడులు, కుటుంబ ఆర్థిక ప్రణాళికపై అవగాహన పెంచుకోవడం ద్వారా కుటుంబాభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రాగునీటికే తొలి ప్రాధాన్యం.. కొత్తగా వరి సాగు చేయొద్దు

- ఎల్‌నినో ప్రభావంతో నీటి సంక్షోభం తప్పదు - రైతులకు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ విజ్ఞప్తి

- కణేకల్ చెరువును పరిశీలించిన కలెక్టర్.. - హెచ్ఎల్‌సీ నీటి వినియోగంపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

కణేకల్, జూలై 28 ప్రభాతవార్త:

ఎల్‌నినో ప్రభావంతో ఈఏడాది అనంతపురం జిల్లాలో తీవ్ర నీటికొరత నెలకొనే అవకాశాలు ఉన్నందున అందుబాటులోకి వచ్చే ప్రతి నీటి బొట్టును త్రాగునీటి అవసరాలకే వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. రైతులు పరిస్థితిని అర్థంచేసుకుని కొత్తగా వరిసాగుకు దూరంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం కణేకల్ మండల కేంద్రంలోని కణేకల్ చెరువును, హెచ్ఎల్‌సీ త్రాగునీటి పరిస్థితులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆగస్టునెలలో హెచ్ఎల్‌సీనుంచి త్రాగునీటి కోసం కొంతమేర నీటివిడుదలకు అవకాశం ఉందన్నారు. హెచ్ఎల్‌సీ ద్వారా వచ్చే నీటితో పాటు వర్షపు నీటికి కూడా త్రాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో వర్షాభావపరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు మైక్రో ఇరిగేషన్ పద్ధతులను అనుసరించి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అధిక నీటి అవసరమయ్యే వరిపంటను కొత్తగా ఎట్టి పరిస్థితుల్లోనూ సాగు చేయవద్దని కోరారు. ఇప్పటికే వరి సాగు చేస్తున్న రైతులు ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ విధానాన్ని అమలు చేస్తే 40 నుంచి 50 శాతం వరకు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని వివరించారు. హెచ్ఎల్‌సీ ద్వారా త్రాగునీటి కేటాయింపు ప్రారంభమైన వెంటనే రెవెన్యూ, పోలీసు, నీటిపారుదల శాఖల అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. కాలువల నుంచి అనధికారికంగా మోటార్లు ఏర్పాటుచేసి నీటిని తరలించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించ బోమని హెచ్చరించారు. జిల్లాలోని సత్యసాయి స్కీమ్, ఆర్డబ్ల్యూఎస్ పథకాలు, పీఏబీఆర్‌తో పాటు వివిధ చిన్నరిజర్వాయర్లను నింపగలిగితేనే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని సుమారు 800 గ్రామాలకు త్రాగునీరు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల నీటి సంరక్షణలో ప్రతి రైతు, ప్రతి పౌరుడు ప్రభుత్వానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో హెచ్ఎల్‌సీ ఎస్ఈ సుధాకర్ రావు, తహసీల్దార్ బ్రహ్మయ్య, హెచ్.ఎల్.సి.డిఈఈ దివాకర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి జగదీష్ బాబు, హెచ్ ఎల్ సి జె ఈ ఈ మారుతి, వీఆర్వో పవన్ కుమార్ మరియు నాయకులు రాష్ట్ర ఉప్పార సంఘం డైరెక్టర్ ఆనంద్ రాజులు, శ్రీ చిక్కనేశ్వర వడియార్ నీటి సంఘం అధ్యక్షుడు బిటి రమేష్ , మాజీ ఎంపీపీ మాబు, రైతు డిపో చాందు, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులను వెలికితీసే భాగమే ఈ పోటీలు నిర్వహణ

- అద్భుతంగా రాణిస్తున్న అగ్ర స్థాయి క్రీడాకారులే మనకు స్ఫూర్తి..

- కొత్తచెరువు ప్రభుత్వ పాఠశాలలో అమరావతి చాంపియన్ షిప్ నియోజవర్గ స్థాయి పోటీలను ప్రారంభించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

కొత్తచెరువు, జూలై 28 ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు మంగళవారం కొత్తచెరువు బాలుర ఉన్నత ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో అమరావతి ఛాంపియన్షిప్ పుట్టపర్తి నియోజకవర్గం స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే మాజీ మంత్రి పల్లె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, మొత్తం 12 క్రీడాంశాల్లో ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవ లేదని, సరైన అవకాశాలు, శిక్షణ, ప్రోత్సాహం కల్పిస్తే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం ఖాయమని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు దేశానికి గర్వకారణమని ఆమె అన్నారు. చెస్‌లో విశ్వనాథన్ ఆనంద్, బ్యాడ్మింటన్‌లో పి.వి. సింధు, చదరంగంలో కోనేరు హంపి, క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ వంటి క్రీడాకారులు యువతకు స్ఫూర్తిదాయకులని తెలిపారు. అలాంటి ప్రతిభావంతులు గ్రామీణ ప్రాంతాల నుంచే వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు. పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి షాట్‌పుట్, జావెలిన్ త్రో విసిరి క్రీడాకారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కూడా పలు క్రీడల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్తేజపరిచారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని, గెలుపుఓటములను సమానంగా స్వీకరించి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, విద్యార్థులు, యువ క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రక్రియను అత్యంత నాణ్యతతో పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ - పనుల వేగవంతానికి ల్యాప్‌టాప్‌ల పంపిణీ

శ్రీ సత్యసాయి జిల్లా, జూలై 28, ప్రభాతవార్త ప్రతినిధి

మండల సర్వేయర్లకు ల్యాప్ టాప్ లను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా, అత్యంత నాణ్యతతో పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలియజేశారు. ఇందులో భాగంగా డీఎస్ఎస్ఎల్ఆర్ కార్యాలయం నుండి నూతనంగా మంజూరైన ల్యాప్‌టాప్‌లను జిల్లాలోని అన్ని మండలాలకు కేటాయించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కలసి మండల సర్వేయర్లకు ఈ ల్యాప్‌టాప్‌లను స్వయంగా పంపిణీ చేశారు. సర్వేయర్లకు పలు సూచనలు చేస్తూ, పంపిణీ చేసిన ల్యాప్‌టాప్‌లను కేవలం రీసర్వే సంబంధిత అధికారిక పనులకు మాత్రమే ప్రత్యేకంగా వినియోగించాలనీ, రీసర్వే పనుల్లో పురోగతి సాధిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా చేరుకోవాలన్నారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో నిర్వహించిన రీసర్వే వివరాలకు సంబంధించిన వెక్టరైజేషన్ ప్రక్రియను ఎప్పటికప్పుడు, అదే రోజు పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రీసర్వే పనులన్నింటినీ 2026 డిసెంబర్ 31 నాటికి పక్కా ప్రణాళికతో, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రీసర్వే ఎడి విజయశాంతి ,అధికారులు, మండల సర్వేయర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండలో ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి సవిత..

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి..

ప్రజాదర్బార్ లో మంత్రి సవిత

పెనుకొండ జూలై 28 ప్రభాతవార్త

పెనుకొండ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ప్రజా దర్బార్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు అందజేశారు. సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్న పలువురు కుటుంబాలు తమకు ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. అలాగే రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్లు, ఇతర పరిపాలనా పరమైన సమస్యలపై కూడా పలువురు అర్జీలు సమర్పించారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిపత్రాన్ని మంత్రి సవిత స్వయంగా స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పెనుకొండ పట్టణ టిడిపి కన్వీనర్ కన్వీనర్ శ్రీరాములు, పైవ్ మెన్ కమిటి సభ్యులు మాజీ ఎంపీటీసీ వెంకటరమణస్వామి (సోమప్ప) సూర్యనారాయణ, టిడిపి నాయకులు ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనుమ ఆలయానికి రూ.2.69 కోట్ల నిధులు మంజూరు

- ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక కృషి

కనుమ యోగలక్ష్మీనరసింహస్వామి ఆలయం

చిలమత్తూరు, జూలై 28 ప్రభాతవార్త

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవతో చిలమత్తూరు మండలంలోని కనుమ అటవీప్రాంతంలో గల యోగలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 2.69 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనుమ ఆలయంతో పాటు పరిగిలో వున్న వెంకటేశ్వరస్వామి ఆలయం పునరుద్ధరణ పనులకై 1.08 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ప్రకటన వెలువడింది. ఎన్నో సంవత్సరాలుగా కనుమ ఆలయం పునరుద్ధరణ కోసం నిధులు మంజూరు కాకపోవడం అభివృద్ధి జరగలేదు. ప్రస్తుతం ఒక్కసారిగా 2.69 కోట్ల నిధులు మంజూరు కావడంపై ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మల్యే బాలకృష్ణతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికి తెలుగుదేశం

-పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జె.సి

తాడిపత్రిఅర్బన్, జూలై 28 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని కావేరిసముద్రం గ్రామంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పర్యటిస్తూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అలాగే పలు దశల్లో జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టులు, బాగుచేసిన రోడ్ల గురించి ప్రజలకు తెలియజేశారు. గత ఐదు సంవత్సరాల్లో జరిగిన విధ్వంసం, అలాగే ప్రజలు పడిన ఇబ్బందులు గుర్తుచేస్తూ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్య క్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లులను ఆల్ ఇండియా తంజీమ్‌ఏ ఇన్సాఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.జాఫర్

అనంతపురం, జూలై 28 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.జాఫర్

బిజెపి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫు సవరణ బిల్లును ఆల్ ఇండియా తంజీమ్ ఏ ఇన్సాఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.జాఫర్ పేర్కొనా న్నరు. 1947లో విభజన సమయంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఢిల్లీలోని జామా మసీద్ మెట్లపై నిలబడి ముస్లింలను ఉద్దేశించి ఈ దేశం మనది ఈ మట్టి మనది అని చారిత్రక ప్రసంగాన్ని చేశారు. కేంద్రం తెచ్చిన బిల్లు దశాబ్దాలుగా ఉన్న ఇటువంటి చారిత్రక ప్రార్థన స్థలాలు ఆస్తుల ప్రయోజనాలపై అనుమానాలు రేకెత్తిస్తుందని విమర్శించారు. ఈ సవరణ బిల్లు ద్వారా వక్ఫు బోర్డుల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసి, ముస్లిం వర్గానికి చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వక్ఫు ఆస్తులు ప్రభుత్వం ఇచ్చినవి కావు పూర్వీకులు సమాజ శ్రేయస్సు మతపరమైన ప్రయోజనాల కోసం దానం చేసిన భూములని ప్రభుత్వం దృష్టికి తీసుకు వస్తున్నామన్నారు. వక్ఫు ఆస్తుల రక్షణ, మైనార్టీల హక్కులు, రాజ్యాంగబద్ధమైన స్వయం ప్రతిపత్తిని కాపాడాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.జాఫర్ డిమాండ్ చేస్తున్నామన్నారు.

రాజీవ్ కాలనీలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం

- ఈ రెండేళ్లలో కేవలం మోళిక వసతుల కోసమే 200కోట్లు ఖర్చు చేశాం - ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

రాజీవ్ కాలనీలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, జూలై 28 ప్రభాతవార్త :

రెండేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రూ.1262 కోట్ల మేర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామని. ఇది మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ కాలనీలోఉన్న భగత్ సింగ్ నగర్ లో ఆయన ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు కాలనీవాసులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రెండేళ్లలో చేసిన వాటిగురించి కరపత్రాలను అందజేశారు. అలాగే సంక్షేమ పథకాలు అందుతున్నాయా కాలనీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరాతీస్తూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే పర్యటనకు మంచి స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. రెండేళ్లలో సంక్షేమ, అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టారన్నారు. ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. 75 ఏళ్ల వయసులో 25 ఏళ్ల యువకుడిలా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికే 25 లక్షల కోట్లరూపాయల పెట్టుబడులు వచ్చాయని25 లక్షల ఉద్యోగాల కల్పిస్తున్నారన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ వలనే జరుగుతోందన్నారు. గతంలో జగన్ రెడ్డి అమరావతితో మూడు ముక్కలాట ఆడితే.. భవిష్యత్‌లో రాజధానిని ఎవరు కదిలించకూడదనే ఉద్దేశంతో చట్టబద్ధత కల్పించారన్నారు. అమరావతిలో భవనాల నిర్మాణం వేగంగా సాగుతోందని. ప్రపంచంలోనే నెంబర్1 సిటీగా మారుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు201419 కాలంలో దాదాపుగా పూర్తి చేశారని. అయితే గత ఐదేళ్లలో కనీసం గంపెడు మట్టి కూడా వేయని కారణంగా పోలవరం ఆగిపోయిందన్నారు. 2027లో పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తారన్నారు. రాయలసీమకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని... ఒక్క అనంతపురం జిల్లాలోని లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చినట్లు చెప్పారు. విద్యావ్యవస్థలో మంత్రి నారాలోకేష్ తీసుకొచ్చిన మార్పుల కారణంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. ఈ ఏడాది లక్షా 10వేల మంది ప్రైవేట్‌విద్యాసంస్థల నుంచి ప్రభుత్వబడుల్లో చేరారన్నారు. ఎమ్మెల్యేలుచేత సిఫార్సులు చేయించుకునే పరిస్థితిలో నేడు ప్రభుత్వపాఠశాలలు ఉన్నాయన్నారు. 67 లక్షలమందికి పైగా 10వేల120కోట్లమీద తల్లికి వందనం అమలు చేస్తున్నారన్నారు. అనంతపురం జిల్లాలో హంద్రీనీవా కాలువను 1800 క్యూసెక్కుల నుంచి 3800 క్యూసెక్కులకు పెంచారన్నారు. 3500 కోట్ల రూపాయల ఖర్చు చేసి.. ఇటు కుప్పం, అటు మడకశిర వరకు నీరు తీసుకెళ్తున్నారన్నారు. రెండేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో కేవలం మోళిక వసతుల కోసం 200 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పారు. 7కోట్ల రూపాయల వరకు సీఎంఆర్ఎఫ్ కింద సాయం చేసినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో కనీసం కోటి రూపాయలు కూడా ఇవ్వలేదని విమర్శలు చేశారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితాల సవరణ

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ , హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

పుట్టపర్తి, జూలై 28, ప్రభాతవార్త

ఎస్ఐఆర్-2026 కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమగ్రంగా నిర్వహిస్తు న్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు భారత ఎన్నికల సంఘం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పురోగతిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాకలెక్టర్, జిల్లాఎన్నికల అధికారి శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ, అర్హుడైన ప్రతి ఓటరు పేరు నమోదు కావడం, అనర్హుల పేర్లు తొలగించడం, వివరాల్లోని తప్పులను సరిదిద్దడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం భౌగోళిక పరిస్థితులు, 1200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ప్రాంతాలు ఓటర్ల సౌకర్యాన్ని పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య, ఆయా నియోజకవర్గాల ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీలలో మెరిసిన ధర్మవరం విద్యార్థులు

అభినందించిన జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా , జులై 28, ప్రభాతవార్త ప్రతినిధి

కరాటే పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

తమిళనాడులోని ఇడప్పాడిలో నిర్వహించిన "ఆల్ ఇండియా క్యోకుషిన్ కరాటే జూనియర్స్ కాటా , కుమిటే టోర్నమెంట్"లో ధర్మవరానికి చెందిన "సిరిపి వెంకటేష్ కరాటే అకాడమీ" విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. అలాగే హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు ఈవెంట్‌లోనూ అకాడమీ విద్యార్థులు పతకాలు పొంది సత్తా చాటారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో విజేతలైన క్రీడాకారులను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తేగలరని ఆకాంక్షించారు. ఈ కరాటే పోటీల యందు కాటా (ర్నీ) విభాగం లో ప్రథమ స్థానం సీరిపి ఉజ్వల్ (అండర్7), బుగ్గ హేమంత్ (అండర్7), సాకే లోకేష్ (అండర్8 అండర్ 10), బోయ మోక్షిత (అండర్9), అగ్రహారం శ్రీ చందన (అండర్11), సరిగా చరణ్ సాయి (అండర్12), సంగాల యశ్వంత్ (అండర్12), బుగ్గ వంశీ కృష్ణ (అండర్ 12). ద్వితీయ స్థానం లో పాల్యం ఆదిత్య (అండర్7), జక్క గీతిక (అండర్9), సాకే సుశాంత్ (అండర్9). తృతీయ స్థానం : గురుకుల్ మోక్షిత (అండర్13), ముక్కర గోవర్ధన్ (అండర్13)లు విజయం సాధించారు. అదేవిధంగా కుమిటే ఫైట్ విభాగంలో, తృతీయ స్థానం లో సాకే లోకేష్ (అండర్8), నంబూరు వేద శ్రీ (అండర్8), అగ్రహారం శ్రీ చందన (అండరు11) లతోపాటు ఫియర్‌లెస్ ఫైటర్లా బుగ్గ హేమంత్ (అండర్ 7) బోల్డ్ ఫైటర్స్: బుగ్గ వంశీ కృష్ణ (అండర్ 12), బి. ప్రవీణ్ కుమార్ (అండర్12), సంగాల భారద్వాజ్ (అండర్14) ప్రత్యేక పురస్కారాలు లభించినట్లు తెలియజేశారు. అంతేకాకుండా గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ (హైదరాబాద్ ఈవెంట్) విజేతలుగా బి. వంశీ కృష్ణ, పి. నమ్రత సాయి, ఏ. ప్రణవి, ఏ. పునీత, ఎస్. భరద్వాజ్, ఎస్. యస్వంత్, యు. లాస్య ప్రియ, ఎస్. వరుణ్, ఎన్. వేద శ్రీ, ఎస్. లోకేష్, బి. హేమంత్ కుమార్, ఏ. చందన, బి. కుషాల్, కోచ్ ఎస్. వెంకటేష్ మాస్టర్ రాణించినట్లు తెలియజే